
సాక్షి
ఏలూరు
బుధవారం : 24 : ఏప్రిల్ : 2024



వైఎస్సార్‌సీపీలో చేరికలు

ఎన్నికల సమీపిస్తున్న సమయంలో వైఎస్సార్‌సీపీలో చేరికలు మరింత జోరందుకున్నాయి. ఇతర పార్టీల నేతలు భారీగా వచ్చి చేరుతున్నారు. 8లో ▸



రాట్నాలమ్మ తిరునాళ్ల ప్రారంభం

రాట్నాలకుంటలో రాట్నాలమ్మవారి తిరునాళ్లు ఘనంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు బాలాత్రిపుర సుందరి అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. 8లో ▸



సరిహద్దుల్లో పటిష్ట నిఘా

ఏలూరు, ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల అంతర్రాష్ట్ర సరిహద్దుల్లో సమన్వయంతో పటిష్ట నిఘా పెట్టాలని కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ సూచించారు. 8లో ▸

న్యూస్‌రీల్

తప్పుడు స్క్రిప్టులు చదివి బఫూన్ అవుతున్నావ్ పవన్

అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం



తాడేపల్లిగూడెం: 'చంద్రబాబు రాసిచ్చిన తప్పుడు స్క్రిప్టులు చదివి బఫూన్ అవుతున్నావ్ పవన్ కళ్యాణ్.. నువ్వు చెప్పే మాటలు విని ఆక్వా రైతులు నవ్వుకుంటున్నారు. నమ్మక ద్రోహానికి, విశ్వాసఘాతానికి ప్రతిరూపమైన చంద్రబాబు నిన్ను అథఃపాతాళానికి తొక్కేయాలని రచించిన స్క్రిప్టులో భాగంగా జరిగిన కుట్రకు బలవుతున్నావ్.. ముందు ఆ విషయాలు తెలుసుకోకుండా ఆక్వా రంగం గురించి అవాస్తవాలు మాట్లాడటం తగదు పవన్..' అని అప్పడా వైస్ చైర్మన్ వడ్డి రఘురాం అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆక్వా రైతులకు సబ్సిడీలు ఇవ్వడంతోపాటు మేత, రొయ్య కొనుగోలు ధరలను స్థిరీకరించినది వైఎస్సార్‌సీపీ ప్రభుత్వమని చెప్పారు. ఆక్వా జోన్ పరిధిలోని చెరువులకు యూనిట్‌కు రూ.1.50 మాత్రమే విద్యుత్ చార్జీలు వసూలు చేస్తున్నారని తెలిపారు. అది కూడా తెలియకుండా యూనిట్‌కు ఐదు రూపాయలు వసూలు చేస్తున్నారని చెబితే నవ్వకుండా ఎవరైనా ఉంటారా పవన్.. అని ప్రశ్నించారు. రైతుల అవసరాల కోసం విశాఖ జిల్లాలో క్వారంటైన్ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆక్వా రైతులకు ఇప్పటివరకు సబ్సిడీ ద్వారా రూ.3,600 కోట్లు ఇచ్చామన్నారు. ఫీడ్ యాక్టు తీసుకొచ్చి సీడ్, ఫీడ్ ధరలను ఎప్పటికప్పుడు నియంత్రిస్తున్నామని వివరించారు. చెరువుల లీజు ధరలను తగ్గించేలా చర్యలు తీసుకున్నామన్నారు. ఆక్వాకు సంబంధించి అన్ని విషయాలను రైతులు తెలుసుకునేలా యాప్‌ను రూపొందించామని తెలిపారు. దేశంలో ఒక్క ఆంధ్రప్రదేశ్‌లోనే ఆక్వా రైతులు ఆనందంగా ఉన్నారని వివరించారు. గత ప్రభుత్వ హయాంలో ఆక్వా రైతుల పరిస్థితి ఏమిటీ.. ఇప్పుడు ఏమిటనే వాస్తవాలను తెలుసుకుని మాట్లాడాలని పవన్ కళ్యాణ్‌కు రఘురాం హితవుపలికారు. తాను ముఖ్యమంత్రిని అవుతానని చెప్పిన పవన్... చంద్రబాబు ట్రాప్‌లో పడి 24 శాతం కాపు జనాభా ఉన్నప్పటికీ, దామాషా పద్ధతిలో అయినా కనీసం 24 సీట్లు తీసుకోలేకపోయారని చెప్పారు. పొత్తు పేరుతో జనసేన తీసుకున్న 21 సీట్లలో కూడా 11 సీట్లను వేరే పార్టీల నుంచి వచ్చినవారికి ఇచ్చేశారని, పది సీట్లతో ముఖ్యమంత్రి అవుతావా పవన్‌కళ్యాణ్... అని రఘురాం ప్రశ్నించారు.

కంట్రోల్ రూమ్ నిర్వహణపై సంతృప్తి



ఇంటిగ్రేటెడ్ కంట్రోల్ రూమ్‌ను పరిశీలిస్తున్న అబ్జర్వర్ కృష్ణకాంత్ పాఠక్

ఏలూరు(మెట్రో): ఏలూరు కలెక్టరేట్‌లోని ఇంటిగ్రేటెడ్, మీడియా కంట్రోల్ రూమ్‌ను సాధారణ ఎన్నికల పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్ మంగళవారం పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. మీడియాలో ప్రసారాలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలుపై వచ్చే ప్రతికూల వార్తలను నమోదు చేసే విధానం, వాటి పరిష్కార తీరుపై ఆరా తీశారు. ఈ మేరకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ వివరాలను తెలియజేశారు. సోషల్ మీడియాలో వచ్చే అంశాలపై అబ్జర్వర్ పాఠక్ సంబంధిత అధికారులు, సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం సీ–విజిల్ పర్యవేక్షక విభాగాన్ని ఆయన పరిశీలించారు. స్టాటిక్ సర్వేలైన్స్ బృందాలు, ఫ్లయింగ్ సర్వేలైన్స్ బృందాల క్షేత్రస్థాయిలో పరిశీలనకు సంబంధించి ఆయా వాహనాలకు అమర్చిన జీపీఎస్ విధానం తదితర వివరాలను తెలుసుకున్నారు. ఎన్నికల కమిషన్‌కు రోజూవారీ నివేదికలు పంపే విభాగాన్ని సందర్శించారు. అనంతరం జిల్లాలో ఎన్నికల సన్నద్ధత ఏర్పాట్లను కలెక్టర్ ఆయనకు వివరించారు. తొలుత జిల్లాలో జరుగుతున్న స్వీప్ కార్యక్రమాలపై ఏర్పాటుచేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను అబ్జర్వర్ పాఠక్ తిలకించారు. జిల్లాలో కంట్రోల్‌రూమ్‌ల నిర్వహణ విధానాలు, తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ ఆయనకు వివరించారు. డీఆర్వో డి.పుష్పమణి ఉన్నారు.

టీసీసీ పరీక్షలకు 41 మంది హాజరు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): జిల్లాలో జరుగుతున్న టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు పరీక్షలకు మంగళవారం 41 మంది హాజరయ్యారు. డ్రాయింగ్ లోయర్ పరీక్షకు 33 మందికి 15 మంది, హయ్యర్ పరీక్షకు 11 మందికి 8 మంది హాజరయ్యారు. టైలరింగ్ హయ్యర్ పరీక్షకు 25 మందికి 18 మంది హాజరయ్యారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.అబ్రహం ప్రకటనలో తెలిపారు.

ఏలూరులో యువకెరటం

- 70 ఏళ్ల చరిత్రలో తొలిసారి బీసీలకు అవకాశం
- ప్రాధాన్యమిచ్చిన వైఎస్సార్‌సీపీ
- ఏలూరు పార్లమెంట్ బరిలో సునీల్‌కుమార్ యాదవ్
- 33 ఏళ్ల యువకుడికి చాన్స్
- జిల్లావ్యాప్తంగా నయా జోష్
- ఏడు అసెంబ్లీ స్థానాల్లోనూ నూతనోత్సాహం



ఏలూరులో ర్యాలీగా వెళుతున్న వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్. చిత్రంలో ఎమ్మెల్యే ఆళ్ల నాని, మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

సాక్షి ప్రతినిధి, ఏలూరు: 70 ఏళ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఏలూరు పార్లమెంటరీ నియోజకవర్గ చరిత్రలో తొలిసారిగా బీసీ యువకుడు ఎన్నికల బరిలో నిలిచాడు. ఉన్నత విద్యావంతుడు, జిల్లాలో సుపరిచితమైన రాజకీయ కుటుంబం నుంచి వచ్చిన యువకుడికి అధికార వైఎస్సార్‌సీపీ పట్టం కట్టింది. దాదాపు ఐదు దశాబ్దాలుగా ఒకే సామాజికవర్గ నేతలు వివిధ రాజకీయ పార్టీల నుంచి ఇక్కడ ఎంపీలుగా ఎన్నికవుతున్నారు. అలాంటి సామాజిక సమీకరణాలను బ్రేక్ వేస్తూ బీసీలంటే బ్యాక్‌వర్డ్ క్యాస్ట్ కాదు.. బ్యాక్‌బోన్ క్యాస్ట్ అంటూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆచరణలో చేసి చూపించారు. దీంతో ఏలూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఎన్నికల బరిలో నుంచి మంగళవారం అశేష జనవాహిని నడుమ నామినేషన్ దాఖలు చేశారు.

రెండు నెలల ముందే ఎంపిక

70 ఏళ్ల చరిత్ర ఉన్న ఏలూరు ఎంపీ స్థానంలో వైఎస్సార్‌సీపీ ఎన్నికలకు రెండు నెలలు ముందే బీసీ అభ్యర్థిని ఎంపిక చేసింది. ఈ క్రమంలో టీడీపీ కూడా ఇదే బాట అనివార్యంగా పట్టాల్సిన పరిస్థితి. మాజీ ఎంపీ మాగంటి బాబుతో సహా పలువురు సొంత సామాజికవర్గ నేతలు టీడీపీ టికెట్ కోసం విపరీతంగా ప్రయత్నించారు. ఆఖరుకు స్థానిక బీసీ నేతలు ఎవరినీ కాదని రాయలసీమ నుంచి దిగుమతి నేత పుట్టా మహేష్‌ను చివరి నిమిషంలో టీడీపీ బరిలో నిలిపింది. దీంతో ఈ ఎన్నికలు లోకల్, నాన్‌లోకల్ వార్‌గా మారాయి.

చరిత్ర చూస్తే..

1952 ద్విసభ ఎన్నికల్లో, 1957 ఎన్నికల్లో మాత్రమే చంద్రబాబు సామాజికవర్గానికి చెందని వారు ఇక్కడ గెలుపొందారు. ఆ తర్వాత 52 ఏళ్ల ఒకే సామాజికవర్గం నుంచి వేర్వేరు పార్టీల ద్వారా అభ్యర్థులు ఎన్నికవుతూ వచ్చారు. ఇలాంటి చరిత్రను తిరగరాస్తూ వైఎస్సార్‌సీపీ తొలిసారిగా బీసీ అభ్యర్థికి ఏలూరు పార్లమెంట్‌లో అవకాశం ఇచ్చింది. అది కూడా స్థానికుడు, ఉన్నత విద్యావంతుడు, 33 ఏళ్ల యువకుడు కావడంతో జిల్లాలోని బీసీల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. 1962లో వి.విమలాదేవి, 1967, 71, 77లో కాంగ్రెస్ నుంచి కొమ్మారెడ్డి సూర్యనారాయణ, 1980లో కాంగ్రెస్ (ఐ) నుంచి చిట్టూరి సుబ్బారావుచౌదరి, **1984, 1991, 1996, 1999లో టీడీపీ నుంచి బోళ్ల బుల్లిరామయ్య, 1989లో కాంగ్రెస్ నుంచి కృష్ణ, 1998లో కాంగ్రెస్ నుంచి మాగంటి వెంకటేశ్వర**రావు, 2004, 2009లో కాంగ్రెస్ నుంచి కావూరి సాంబశివరావు, 2014లో టీడీపీ నుంచి మాగంటి బాబు పనిచేశారు. 2019లో సామాజిక సమీకరణాన్ని వైఎస్సార్‌సీపీ పూర్తిగా మార్చివేసింది. స్థానికంగా బలమైన రాజకీయ కుటుంబానికి చెందిన, పేరున్న కోటగిరి విద్యాధరరావు కుమారుడు శ్రీధర్‌ను అభ్యర్థిగా ప్రకటించింది. ఈ క్రమంలో పార్లమెంట్ చరిత్రలోనే అత్యధిక మెజార్టీ నమోదు చేసిన మొదటి ముగ్గురులో శ్రీధర్ నిలిచారు. 1,65,925 ఓట్ల మెజార్టీతో ఆయన గత ఎన్నికల్లో గెలుపొందారు.

సునీల్‌కుమార్ లోకల్

ఇక పార్లమెంట్ బరిలో లోకల్, నాన్‌లోకల్ వార్‌కు ప్రజల్లో తెరలేచింది. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ జిల్లా వ్యక్తి కావడం, ఆయన తండ్రి మంత్రి కారుమూరి నాగేశ్వరరావు పశ్చిమగోదావరి జిల్లా జెడ్పీ చైర్మన్‌గా పనిచేయడంతో జిల్లావ్యాప్తంగా మంచి పరిచయాలు ఉన్నాయి. దీంతో పాటు స్థానికంగానూ బంధుత్వాలు ఉన్నాయి. ఇక వైఎస్సార్ కడప జిల్లాలోని మైదుకూరుకు చెందిన పుట్టా మహేష్ యాదవ్‌ను టీడీపీ అభ్యర్థిగా ప్రకటించింది. జిల్లా గురించి ఓనమాలు తెలియని వ్యక్తి అభ్యర్థిగా రావడంతో టీడీపీ నేతలే తలలు పట్టుకున్నారు. దీంతో లోకల్, నాన్‌లోకల్ అభ్యర్థుల మధ్య ఎన్నికల పోరు అంటూ ప్రజల్లో బలమైన చర్చ సాగుతోంది.

భారీగా నామినేషన్ల సమర్పణ

ఏలూరు(మెట్రో): జిల్లావ్యాప్తంగా నామినేషన్‌ల పర్వం జోరుగా సాగుతోంది. అభ్యర్థులు భారీ ర్యాలీలుగా నామినేషన్లు దాఖలు చేస్తున్నారు. మంగళవారం ఏలూరు వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ నామినేషన్ దాఖలు చేశారు. అలాగే వైఎస్సార్ సీపీ నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా మేకా వెంకట ప్రతాప్ అప్పారావు నామినేషన్ పత్రాలు సమర్పించారు. అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఏలూరు టీడీపీ అభ్యర్థి బడేటి చంటి, కైకలూరు బీజేపీ అభ్యర్థి కామినేని శ్రీనివాస్, ఉంగుటూరు జనసేన అభ్యర్థి పత్సమట్ల ధర్మరాజు నామినేషన్‌లు సమర్పించారు. ఈనెల 25తో నామినేషన్ల సమర్పణ ప్రక్రియ ముగియనుంది. దీంతో మంగళవారం ఒక్క రోజే ఏలూరు ఎంపీ అభ్యర్థికి 3 సెట్ల నామినేషన్‌లు దాఖలు కాగా, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఉంగుటూరులో 6 సెట్లు, దెందులూరులో 2 సెట్లు, ఏలూరులో 5 సెట్లు, పోలవరంలో 4 సెట్లు, చింతలపూడిలో 2 సెట్లు, నూజివీడులో 1 సెట్టు, కైకలూరులో 6 సెట్లు నామినేషన్లు దాఖలయ్యాయి. ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా ఏలూరు పార్లమెంట్ నియోజకవర్గానికి 13 సెట్ల నామినేషన్‌లు దాఖలు కాగా, ఉంగుటూరులో 11, దెందులూరులో 10, ఏలూరులో 12, పోలవరంలో 10, చింతలపూడిలో 9, నూజివీడులో 11, కైకలూరులో 18 నామినేషన్‌లు దాఖలు చేశారు. చివరి రెండు రోజుల్లో ప్రధాన పార్టీ అభ్యర్థులతో పాటు ఇండిపెండెంట్‌లు సైతం నామినేషన్‌లు దాఖలు చేసేందుకు పోటాపోటీగా సిద్ధమవుతున్నారు.

గౌడలంతా వైఎస్సార్‌సీపీ వైపే..

గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అశోక్‌గౌడ్



గంగన్నగూడెంలో ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న చలమోలు అశోక్‌గౌడ్. చిత్రంలో వైఎస్సార్‌సీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలతో పాటు వివిధ రకాల అభివృద్ధి, సంక్షేమం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాల అభ్యున్నతితో పాటు కుల వృత్తుల అభ్యున్నతికి చేస్తున్న కృషి, సేవ చాలా గొప్పదని గౌడ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చలమోలు అశోక్‌గౌడ్ అన్నారు. మంగళవారం రాత్రి గంగన్నగూడెం కృష్ణా కన్వెన్షన్ హాలులో దెందులూరు ఏఎంసీ మాజీ చైర్మన్ మేకా లక్ష్మణరావు అధ్యక్షతన దెందులూరు నియోజకవర్గ గౌడ సామాజికవర్గ ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ టీడీపీ బీసీలను ఓట్ల కోసం ఉపయోగించుకుని అన్నిరకాలుగా మోసం చేసిందని విమర్శించారు. సీఎం జగన్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. భవిష్యత్‌లో గౌడ సామాజికవర్గానికి వృత్తిపరంగా మరింత అభివృద్ధి, సంక్షేమం వైఎస్సార్‌సీపీతోనే సాధ్యమని అన్నారు.

రూ.1,575 కోట్ల నిధులు

గౌడ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ఎం.శివరామకృష్ణ మాట్లాడుతూ రాష్ట్రంలో రూ.1,575 కోట్ల నిధులను గౌడ్ సంక్షేమం, అభివృద్ధి కోసం సీఎం జగన్ వెచ్చించారన్నారు. గౌడ సామాజికవర్గ ఉజ్వల భవిష్యత్, భద్రతకు గీత పాలసీ ఏర్పాటు చేశారన్నారు. రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇస్తారన్నారు. బీసీలకు ఉన్నత స్థానం కల్పించిన ఏకైక సీఎం జగన్ అని కొనియాడారు. మంత్రి వర్గంలో స్థానం, జెడ్పీ చైర్మన్, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు వంటి పలు పదవులకు అవకాశం కల్పించారన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ మాట్లాడుతూ ఏలూరు నియోజకవర్గంలో తొలిసారిగా బీసీకి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసేందుకు సీఎం జగన్ అవకాశం కల్పించారని, అందరూ మద్దతు ఇవ్వాలి కోరారు. తెలుగుదేశం పార్టీ స్థానికంగా అభ్యర్థులు ఎవరూ లేరన్నట్టుగా కడప నుంచి అభ్యర్థిని తీసుకువచ్చి పోటీలో పెట్టిందని విమర్శించారు. తనను గెలిపిస్తే గౌడ సామాజికవర్గ సమస్యల పరిష్కారం కోసం పార్లమెంటులో చర్చిస్తానని, రైతులు, యువతకు తొలి ప్రాధాన్యమిస్తానని సునీల్‌కుమార్ అన్నారు.

నిరంతర కృషి

దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ స్ఫూర్తితో గౌడ సామాజిక వర్గ భవిష్యత్, భద్రతకు నిరంతరం కృషి చేస్తానన్నారు. గౌడ సామాజికవర్గ బీమాకు కృషి చేస్తానని, అవసరమైతే తన సొంత సొమ్ములతో బీమా కల్పిస్తానన్నారు. నియోజకవర్గంలో గౌడ కమ్యూనిటీ హాళ్లు నిర్మించామని, నియోజకవర్గ స్థాయిలో కల్యాణ మండపం నిర్మాస్తామన్నారు. దెందులూరు ఎమ్మెల్యేగా తనను, ఎంపీ అభ్యర్థిగా సునీత్‌కుమార్‌ను బలపర్చాలని, మీ కుటుంబ సభ్యుడిగా ఉంటామని అన్నారు. కొఠారు రామచంద్రరావు మాట్లాడారు. సమావేశంలో టీటీడీ బోర్డు మెంబర్ నెరుసు రాంబాబు, వడ్డీల కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముంగర సంజీవ్ కుమార్, గౌడ సంఘం జిల్లా అధ్యక్షుడు రమణమూర్తి, నియోజకవర్గ అధ్యక్షుడు ఎం.రమాశంకర్, కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ మండలి కొండలరావు, జెడ్పీటీసీ నిట్టా లీలానవకాంతం, పెదవేగి ఎంపీపీ తాతా రమ్యశ్రీ, తాతా సత్యనారాయణ, మోరు రామరాజు, కట్టా ఏసుబాబు, సింహాద్రి శ్రీమన్నారాయణ, కాగిత అచ్యుత్, సర్పంచులు, ఎంపీటీసీ, గౌడ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో అన్ని స్థానాలూ గెలుచుకుంటాం

వైఎస్సార్‌సీపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్

ఏలూరు టౌన్: ఏలూరు జిల్లాలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగరేస్తామనీ.. ఏలూరు ఎంపీ, ఏడు అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకుని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇస్తామని ఏలూరు ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ అన్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా ఆయన మంగళవారం నామినేషన్ వేశారు. తొలుత ఏలూరు పాత బస్టాండ్ సెంటర్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం ఏలూరు జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీతో కలిసి జూట్ మిల్లు సెంటర్‌లోని జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు, ఏలూరు ఎంపీ కోటగిరి శ్రీధర్‌తోపాటు కైకలూరు ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు, పోలవరం ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంబం విజయరాజుతోపాటు భారీ ఎత్తున నేతలు, పార్టీ కేడర్‌తో కలిసి పాదయాత్రగా బయలుదేరారు. రైల్వే పై ఓవర్ బ్రిడ్జి మీదుగా ఫైర్‌స్టేషన్ సెంటర్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఏలూరు జిల్లా అధ్యక్షుడు, ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని, దెందులూరు ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి ఎంపీ అభ్యర్థి సునీల్‌కుమార్‌కు స్వాగతం పలుకుతూ ఆయనతో పాటు పాదయాత్రగా ఎస్ఆర్‌పేట, జెడ్పీ కార్యాలయం రోడ్డు మీదుగా ఏలూరు కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఏలూరు పార్లమెంట్ వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్ ఏలూరు కలెక్టరేట్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి వె.ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ పత్రాన్ని సమర్పించారు.



ఏలూరులో కలెక్టర్ ప్రసన్న వెంకటేష్‌కు నామినేషన్ అందిస్తున్న కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్. చిత్రంలో ఎంపీ శ్రీధర్, ఎమ్మెల్యేలు ఆళ్ల నాని, అబ్బయ్యచౌదరి, చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి విజయరాజు

బాల్య వివాహం నిలుపుదల

భీమడోలు: భీమడోలు పంచాయతీ శివారులో బాల్యవివాహాన్ని మంగళవారం ఐసీడీఎస్ అధికారులు అడ్డుకున్నారు. వివరాలిలా ఉన్నాయి.. అరుంధతీకాలనీకి చెందిన బాలిక (17)కు చింతలపూడి మండలం ప్రగడవరానికి చెందిన అజయ్‌కుమార్‌తో బుధవారం ప్రగడవరంలో వివాహం జరుగనుంది. దీనిపై సమాచారం అందడంతో భీమడోలు ఐసీడీఎస్ పీఓ కేవీ విజయలక్ష్మి, సూపర్‌వైజర్ బేగం, పోలీస్, రెవెన్యూ సిబ్బంది బాలిక ఇంటికి వెళ్లి వివాహ ఏర్పాట్లను అడ్డుకున్నారు. బాలిక 9వ తరగతి చదువుకుని మూడేళ్లుగా ఇంటి వద్దే ఉంటోంది. ఏడు నెలల క్రితం బాలికకు యువకుడితో నిశ్చితార్థం కాగా.. అంగన్‌వాడీ సిబ్బంది వారి కుటుంబానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. అయినా ఇవేమీ పట్టించుకోకుండా వివాహ ఏర్పాట్లు చేయడంతో అడ్డుకున్నారు. బాలికను ఏలూరు ప్రభుత్వ సంరక్షణ కేంద్రానికి తరలించారు. కుటుంబసభ్యుల నుంచి బైండోవర్ తీసుకున్నామని, యువకుడితో పాటు కుటుంబ సభ్యులు ఏలూరులోని జిల్లా అధికారుల వద్దకు హాజరుకావాలని సమాచారం అందించినట్టు పీఓ విజయలక్ష్మి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బేగం తెలిపారు.

కొలుసు పార్థసారథికి 2 నెలల జైలు

అఫిడవిట్‌లో వెల్లడించిన వైనం

నూజివీడు: టీడీపీ ఏలూరు జిల్లా నూజివీడు ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న కొలుసు పార్థసారథికి రెండు నెలల జైలు శిక్ష విధించిన చరిత్ర ఉంది. దానిపై ఆయన హైకోర్టులో స్టే తెచ్చుకున్నారు. తాజాగా తన నామినేషన్ సందర్భంగా సమర్పించిన అఫిడవిట్‌లో ఆయన ఈ వివరాలు పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలో ఉన్న ప్రత్యేక ఎకనామిక్స్ అఫెన్స్ కోర్టు ఫెమా ఉల్లంఘనకు సంబంధించి 2012 జూలై 25న ఒక కేసులో రూ.5 వేలు జరిమానా, మరో కేసుకు సంబంధించి రూ.10 వేలు జరిమానా, రెండు నెలల సాధారణ జైలు శిక్షను విధించిందని అఫిడవిట్‌లో చూపించారు. దీనిపై హైకోర్టులో స్టే తెచ్చుకున్న విషయాన్ని పేర్కొన్నారు. ఇంకా ఘంటసాల పోలీస్‌స్టేషన్‌లో ఒక కేసు ఉందని చూపించారు.

ఆస్తులు, అప్పులు ఇలా..

సారథి తన వద్ద రూ.10 లక్షల నగదు, తన భార్య వద్ద రూ.3 లక్షల నగదు ఉన్నట్టు అఫిడవిట్‌లో పేర్కొన్నారు. చరాస్తులు తన పేరున రూ.6,25,70,654 విలువైనవి ఉండగా, తన భార్య పేరున రూ.2,08,55,000 విలువ కలిగిన చరాస్తులు ఉన్నట్టు చూపించారు. స్థిరాస్తుల విషయమై తన పేరున 17.21 ఎకరాల వ్యవసాయ భూమితో పాటు కైకలూరు, పోరంకి, నల్గొండ జిల్లా నార్కెట్‌పల్లి, హైదరాబాద్‌లలో ఉన్న ఆస్తుల మొత్తం కలిపి రూ.8,13,96,991 విలువగా చూపించారు. తన సతీమణి పేరున రూ.3.03,54,000 విలువ కలిగిన స్థిరాస్తులు ఉన్నట్టు పేర్కొన్నారు. ఇక తన పేరిట రూ.1,26,41,086 అప్పులు ఉన్నట్టు పార్థసారథి అఫిడవిట్‌లో చూపించారు.

బడేటి చంటిపై 420 కేసు

అఫిడవిట్‌లో వెల్లడి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఏలూరు తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య (చంటి)పై రెండు కేసులు ఉన్నట్టు ఆయన తన అఫిడవిట్‌లో పేర్కొన్నారు. తన నామినేషన్ పత్రంతో పాటు అఫిడవిట్‌ను చంటి దాఖలు చేశారు. ఏలూరులోని స్పెషల్ జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో ఐపీసీ 420 (ఛీటింగ్), 468, 471, 120బీ సెక్షన్ల కింద సీసీ నెంబర్ 254/2022గా ప్రైవేట్ కేసు నమోదయిందని అఫిడవిట్‌లో తెలిపారు. అలాగే భీమునిపట్నం పోలీస్‌స్టేషన్‌లో 66/2022 నెంబర్‌తో పేకాటకు సంబంధించిన కేసు నమోదు చేయగా ప్రస్తుతం భీమునిపట్నం జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్ కోర్టులో కేసు విచారణలో ఉంది. కాగా బ్యాంకు డిపాజిట్లు, నగదు, బంగారం, వెండి ఆభరణాల రూపంలో రూ.3.15 కోట్ల ఆస్తులు, మరో రూ.1.98 కోట్ల విలువైన 6 స్థలాలు ఉన్నాయని, మొత్తం రూ.86 లక్షల అప్పులు ఉన్నాయని అఫిడవిట్‌లో తెలిపారు.

ఎన్నికల పరిశీలకుడిగా పాఠక్

ఏలూరు(మెట్రో): రాజస్థాన్ రాష్ట్ర ఆర్థిక శాఖ ప్రిన్సిపాల్ సెక్రటరీ, ఏలూరు జిల్లా ఎన్నికల సాధారణ పరిశీలకుడిగా నియమితులైన కృష్ణకాంత్ పాఠక్ మంగళవారం ఏలూరు విచ్చేశారు. కలెక్టరేట్‌కు చేరుకున్న ఆయనకు కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్వాగతం పలికి పూలమొక్కను అందజేశారు. అనంతరం కలెక్టర్ చాంబర్‌లో సమావేశమయ్యారు. సార్వత్రిక ఎన్నికల నిర్వహణకు తీసుకున్న చర్యలను వివరించారు. ఈవీఎం ర్యాండమైజేషన్, మైక్రో అబ్జర్వర్స్ శిక్షణ, పీఓ, ఏపీఓల శిక్షణ, పోలింగ్ కేంద్రాల్లో మౌలిక వసతులు, కౌంటింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర విషయాలను కలెక్టర్ ఆయనకు తెలియజేశారు. జిల్లాలో 16.35 లక్షల ఓటర్లు ఓటుహక్కును వినియోగించుకునేందుకు 1,744 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికల సంఘ నిబంధనల మేరకు హోమ్ ఓటింగ్, పోస్టల్ బ్యాలెట్ ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయని తెలిపారు.



కృష్ణకాంత్ పాఠక్‌ను పూల మొక్క అందిస్తున్న జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి

జిల్లా ఎస్పీ ఘన స్వాగతం

ఏలూరు టౌన్: ఎన్నికల పరిశీలకుడు కృష్ణకాంత్ పాఠక్‌కు ఎస్పీ డి.మేరీ ప్రశాంతి పూలమొక్క అందించి స్వాగతం పలికారు. ఎన్నికలను సమర్థవంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా నిర్వహించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని ఆయన ఎస్పీకి ఆదేశించారు. జిల్లాలో ఎన్నికల నియమావళిని పూర్తిస్థాయిలో అమలు చేయాలనీ, నిబంధనలు మీరితే చర్యలు తప్పవని అన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకునే ప్రశాంతమైన, భయం లేని వాతావరణాన్ని కల్పించాలని చెప్పారు. నేరస్తుల కదలికలపై నిత్యం నిఘా ఉంచామనీ, గతంలో పలు కేసుల్లో నిందితులుగా ఉన్నవారిని బైండోవర్ చేస్తున్నట్లు ఎస్పీ ఆయనకు వివరించారు.

ఉల్లంఘనలపై నేరుగా ఫిర్యాదు చేయొచ్చు

ఏలూరు(మెట్రో): ఎన్నికల నియమావళి ఉల్లంఘనలపై తనను నేరుగా కలిసి ఫిర్యాదు చేయవచ్చని ఏలూరు పార్లమెంటర్ నియోజకవర్గం, దెందులూరు, ఏలూరు, ఉంగుటూరు అసెంబ్లీ నియోజకవర్గాల ఎన్నికల సాధారణ పరిశీలకులు కృష్ణకాంత్ పాఠక్ అన్నారు. మంగళవారం ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం మాట్లాడుతూ కలెక్టరేట్ సమీపంలోని రెవెన్యూ గెస్ట్‌హౌస్‌లో బస చేశానని చెప్పారు. ఓటర్లను రాజకీయ పార్టీలు ప్రలోభాలకు లోనుచేయకుండా, ప్రజలంతా స్వేచ్ఛగా, నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకునేలా పర్యవేక్షిస్తామన్నారు. జిల్లాలో ఎన్నికల నియమావళి ఉల్లంఘనల జరిగినట్లు రాజకీయ పార్టీలు, ప్రజలు ఎక్కడైనా గుర్తిస్తే, తనకు స్వయంగా కలిసి సమాచారం అందించవచ్చన్నారు. రోజూ ఉదయం 11 గంటలలోపు లేదా సాయంత్రం 5 గంటలు దాటిన తర్వాత తనను కలిసి సాక్ష్యాలతో ఫిర్యాదులు చేయవచ్చన్నారు. తన ఫోన్ నంబర్ 91546 90388కు వివరాలు తెలియజేయవచ్చని ఆయన అన్నారు.

క్లుప్తంగా

కిటకిటలాడిన మద్ది క్షేత్రం



స్వామి వారి దర్శనం కోసం క్యూలైన్‌లో భక్తులు

జంగారెడ్డిగూడెం రూరల్ : గురవాయిగూడెం లోని శ్రీమద్ది ఆంజనేయస్వామి వారి క్షేత్రాన్ని మంగళవారం భక్తులతో కిటకిటలాడింది. ఆలయ అర్చకులు స్వామివారికి తమలపాకులతో విశేష పూజలు నిర్వహించారు. 108 ప్రదక్షిణలు చేసి భక్తులు తమ మొక్కులను తీర్చుకున్నారు. మంగళవారం ఒక్కరోజు రూ.1,73,916 ఆదాయం వచ్చిందని, 1500 మంది భక్తులు స్వామివారి అన్నప్రసాదాన్ని స్వీకరించారని ఆలయ కార్యనిర్వహణాధికారి ఆకుల కొండలరావు చెప్పారు. ఆలయ సూపరింటెండెంట్‌లు జవ్వాది కృష్ణ, కురగంటి రంగారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ఎన్నికల పోలీసు పరిశీలకులుగా శ్రీధర్



శ్రీధర్‌ను కలిసి పుష్పగుచ్ఛం అందజేస్తున్న జిల్లా ఎస్పీ మేరీప్రశాంతి

ఏలూరు టౌన్: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏలూరు జిల్లా ఎన్నికల పోలీస్ పరిశీలకులుగా కర్ణాటక ఐపీఎస్ అధికారి పీ.శ్రీధర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆయన మంగళవారం ఏలూరు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ డీ.మేరీ ప్రశాంతి ఆయన్ను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. ఎన్నికలు సమర్థంవంతంగా నిర్వహించేందుకు చేపట్టిన చర్యలను ఆయనకు వివరించారు. ఎన్నికలు నిష్పక్షపాతంగా, ఓటర్లు స్వేచ్ఛగా ఓటు వినియోగించుకునేలా ప్రశాంతమైన వాతావరణ కల్పించాలని చెప్పారు. ఎన్నికల నియమావళిని పటిష్ఠంగా అమలు చేసేందుకు చర్యలు చేపట్టాలని సూచించారు. ఏలూరు జిల్లా అదనపు ఎస్పీ జీ.స్వరూపరాణి, ఎస్పీ మేరీ ప్రశాంతితో ఆయన కొద్దిసేపు పరిస్థితులపై చర్చించారు.

సంక్షేమ రాజ్యం జగనన్నతోనే సాధ్యం

పలు నియోజకవర్గాల్లో వైఎస్సార్ సీపీ అభ్యర్థులు జోరుగా ప్రచారం



జోగన్నపాలెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి

దెందులూరు: జగనన్న పాలనలోనే పేదలకు సంక్షేమ పథకాలు కొనసాగుతాయని దెందులూరు ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి అన్నారు. మంగళవారం రాత్రి జోగన్నపాలెంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన మాట్లాడారు. నియోజకవర్గంలో అన్ని గ్రామాల్లో సంక్షేమం, అభివృద్ధి జరిగిందన్నారు. జోగన్నపాలెంలో రూ.11 కోట్ల వ్యయంతో గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, వెల్‌నెస్ సెంటర్, నవరత్నాల పథకాల అమలుతో పాటు అభివృద్ధి పనులు జరిగాయన్నారు. జోగన్నపాలెం గ్రామంలో స్థలం కొనుగోలు చేసి గ్రామంలోని అర్హులైన ప్రతి కుటుంబానికీ ఇంటి స్థలం ఇవ్వాలని సీఎం వైఎస్ జగన్‌ను కోరానని గ్రామస్తుల హర్షధ్వానాల మధ్య ఎమ్మెల్యే వెల్లడించారు. టీడీపీ హయాంలో ఈ పనులు ఎందుకు చేయలేకపోయారని ఎమ్మెల్యే ప్రశ్నించారు. టీడీపీ అభ్యర్థులందరికీ చంద్రబాబు బి.ఫారం ఇచ్చినా ఒక్క చింతమనేనికి మాత్రం ఇవ్వలేదని, సమయం ముగిసే వరకు కూడా బి.ఫారం తెచ్చుకోలేని దుస్థితిలో చింతమనేని ఉన్నారన్నారు. తన నామినేషన్ కార్యక్రమానికి నియోజకవర్గం నలుమూలల నుంచి తనను ఆశీర్వదించడానికి తరలివచ్చిన వారందరికీ ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ పార్లమెంట్ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్ యాదవ్, ఎమ్మెల్యే అభ్యర్థిగా తనకు ఓట్లు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం సానిగూడెం ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షులు కామిరెడ్డి నాని, సర్పంచ్ శనపల్లి రామకృష్ణ (విష్ణు), పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో మంగళవారం ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి ప్రచారం నిర్వహించారు. రెండు ఓట్లను ఫ్యాన్ గుర్తుపై వేసి ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థులకు విజయం చేకూర్చాలని ఎమ్మెల్యే కోరారు. ఏపీ ఆయిల్‌ఫెడ్ మాజీ చైర్మన్ కొఠారు రామచంద్రరావు, జెడ్పీటీసీ సభ్యులు నిట్టా లీలానవకాంతం గంగరాజు, కో–ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ పాకలపాటి శ్రీనివాసరావు, పార్టీ గ్రామ కమిటీ అధ్యక్షులు నిట్టా గాంధీ, నియోజకవర్గ పరిశీలకులు, టీటీడీ బోర్డు మెంబర్ నెరుసు రాంబాబు, పెదపాడు ఎంపీపీ బత్తుల రత్నకుమారి ఏసురాజు, పోతునూరు మాజీ సొసైటీ చైర్మన్ డీఎన్‌వీడీ ప్రసాద్ (బజ్జి), సర్పంచ్‌లు చిలకా వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లూ వేయండి



యర్రంపల్లిలో ప్రచార రథంపై నుంచి ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు

చింతలపూడి: ఫ్యాన్ గుర్తుకు రెండు ఓట్లూ వేసి వైఎస్సార్‌పై ఉన్న అభిమానాన్ని చాటాలని వైఎస్సార్ సీపీ చింతలపూడి ఎమ్మెల్యే అభ్యర్థి కంభం విజయరాజు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం యర్రంపల్లి గ్రామంలో ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి ఆధ్వర్యంలో రోడ్‌షో నిర్వహించారు. ఈ సందర్భంగా యర్రంపల్లిలో విజయరాజు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందాయని, ఆయన రుణం తీర్చుకునే సమయం వచ్చిందన్నారు. పేద ప్రజల కోసం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్న పథకాలను ప్రవేశపెట్టి రూ.2.70 లక్షల కోట్లు నేరుగా అక్కచెల్లెమ్మల బ్యాంక్ ఖాతాల్లో జమ చేశారని గుర్తు చేశారు. గత టీడీపీ పాలన, ప్రస్తుత వైఎస్సార్ సీపీ పాలనకు మధ్య తేడాను గమనించి ఓటు వేయాలని కోరారు. నియోజకవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే ఫ్యాన్ గుర్తుకు ఓట్లు వేసి ఏలూరు పార్లమెంట్ అభ్యర్థి కె.సునీల్ కుమార్ యాదవ్, అసెంబ్లీ అభ్యర్థి కె.విజయరాజులను గెలిపించుకోవాలని ఏఎంసీ చైర్‌పర్సన్ జానకిరెడ్డి కోరారు. మోసపూరిత వాగ్దానాలిచ్చే పార్టీలను తరిమికొట్టాలని పిలుపునిచ్చారు. ఇచ్చిన మాటకు కట్టుబడి ఉండే వైఎస్ జగన్‌ను ఆశీర్వదించాలని కోరారు. ఎన్నికల ప్రచారానికి వచ్చిన విజయరాజుకు యర్రంపల్లి గ్రామ ప్రజలు, మహిళలు బ్రహ్మరథం పట్టారు. గ్రామంలోని మహిళలు ఫ్యాన్ గుర్తుకు ఓటు వేస్తామని చెప్పారు. ఏఎంసీ చైర్ పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రోడ్‌షోలో తీన్మార్ డప్పులతో కార్యకర్తలు హల్‌చల్ చేశారు. జగన్ జిందాబాద్ అనే నినాదాలతో గ్రామం హోరెత్తింది. జెడ్పీటీసీ సభ్యులు ఎం.నీరజా సుధాకర్, ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్, మాజీ ఏఎంసీ చైర్మన్ మందలపు సాయిబాబు, మాజీ జెడ్పీటీసీ సభ్యులు సీహెచ్ ఖాదర్‌బాబు, రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి కె.దినేష్‌రెడ్డి, మండల బూత్ కన్వీనర్ ఎస్.భరత్‌రెడ్డి, ప్రగడవరం ఉప సర్పంచ్ ఎస్.రమేష్‌రెడ్డి, మండల సచివాలయాల కన్వీనర్ ఎం.రాంబాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ బి చెంచమరాజు పాల్గొన్నారు.

ఓటు వేసి జగనన్నపై అభిమానం చాటుదాం



పాటల సీడీని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర హోం శాఖ మంత్రి తానేటి వనిత

ద్వారకాతిరుమల: వనితమ్మే కావాలి.. వనితమ్మే రావాలి అనే పాటల సీడీని రాష్ట్ర హోం శాఖ మంత్రి, గోపాలపురం నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిని తానేటి వనిత మంగళవారం ఆవిష్కరించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా దేవరపల్లి మండలం పల్లంట్ల గ్రామానికి వెళ్లిన ఆమె ముందుగా నియోజకవర్గంలోని వైఎస్సార్ సీపీ నేతలతో కలిసి ఈ సీడీని ఆవిష్కరించారు. అనంతరం పాటల రూపకర్తలు, సమర్పకులైన సతీష్, పార్టీ కురుకూరు గ్రామ కమిటీ అధ్యక్షులు శ్రీను, హైదరాబాద్‌కు చెందిన నానిలకు ఆమె ధన్యవాదాలు తెలిపారు. జగనన్నపై అభిమానం, తనపై ఉన్న ప్రేమను చాటుతూ.. ఎంతో శ్రమించి ఈ పాటల రూపకల్పన చేయడం అభినందనీయమన్నారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి వనిత ప్రసంగిస్తూ ప్రజలు మళ్లీ జగనన్నను ఆశీర్వదించి మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలన్నారు. గత ఐదేళ్లలో పొందిన సంక్షేమ పాలన మళ్లీ తిరిగి పొందుదామని పిలుపునిచ్చారు. ప్రతి కుటుంబంలో, ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించామన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి తనను అఖండ మెజారిటీతో గెలిపించాలని కోరారు. వైఎస్సార్ సీపీ ద్వారకాతిరుమల మండల కన్వీనర్ ప్రతాపనేని వాసు, పార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మల్లిపూడి నాగమణి, మండల కో–ఆప్షన్ సభ్యుడు షేక్ భాషా, మండల జేసీఎస్ కన్వీనర్ భోగరాజు సాయికృష్ణ, ఆచంట బన్ను పాల్గొన్నారు.

ట్రిపుల్ ఐటీలో ఆంగ్ల భాషా దినోత్సవం

నూజివీడు: స్థానిక ట్రిపుల్ ఐటీలో మంగళవారం ఆంగ్ల భాషా దినోత్సవాన్ని నిర్వహించారు. ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో ఫ్యాకల్టీ కాత్యాయని ఆధ్వర్యంలో విద్యార్థులకు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను ప్రోత్సహించడంలో భాగంగా డిబేట్, గ్రూపు డిస్కషన్స్, యూత్ పార్లమెంట్, కథారచన, వక్తృత్వం, వ్యాసరచన తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేశారు. ఈ సందర్భంగా కాత్యాయని మాట్లాడుతూ భాష, సాహిత్యం ప్రాముఖ్యతను విద్యార్థులకు వివరించారు. ఇంగ్లిష్ డిపార్ట్‌మెంట్ హెచ్‌వోడీ రాజేష్ మాట్లాడుతూ భాషపై సరైన అవగాహన పొందడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతో దోహదపడతాయన్నారు. ఆర్ట్స్ అండ్ మ్యూజిక్ విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో డీఎస్‌డబ్ల్యూ దుర్గా భవాని, చీఫ్ వార్డెన్ సుబ్బలక్ష్మి, సంగీత విభాగం హెచ్‌వోడీ శ్రీధర్ పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలోకి భారీగా చేరికలు



ఎమ్మెల్యే నాని సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ, జనసేన కార్యకర్తలు



పిప్పరలో వైఎస్సార్ సీపీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే వాసుబాబు, ఎంపీ కోటగిరి

ఏలూరు టౌన్ : ఏలూరు నగరం అభివృద్ధి, ప్రజలు ప్రశాంతంగా జీవించేందుకు, పేద, మధ్యతరగతి వర్గాలకు సంక్షేమ పథకాలు అందాలంటే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరోసారి అధికారంలోకి రావాలని, ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని ఏలూరు ఎమ్మెల్యే, పార్టీ జిల్లా అధ్యక్షులు ఆళ్ల నాని కోరారు. ఏలూరు శ్రీరామ్‌నగర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే నాని సమక్షంలో పెద్దసంఖ్యలో టీడీపీ, జనసేన పార్టీల నుంచి కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. జనసేన జాయింట్ సెక్రటరీ వల్లూరి రమేష్ ఆధ్వర్యంలో 12వ డివిజన్‌కు చెందిన 100 మంది టీడీపీ, జనసేన కార్యకర్తలు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికీ ఎమ్మెల్యే నాని పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానం పలికారు. అనంతరం 47, 48 డివిజన్లకు చెందిన షేక్ ముస్తాక్ ఆధ్వర్యంలో టీడీపీ కార్యకర్తలు వైఎస్సార్ సీపీలో చేరారు. ఎమ్మెల్యే నాని మాట్లాడుతూ రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో పేదల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలన్నారు. ఏలూరు నియోజకవర్గంలో ప్రజలకు ప్రశాంతమైన వాతావరణంలో జీవించాలంటే వైఎస్సార్ సీపీ విజయం సాధించాలని కోరారు. రాష్ట్రంలో చంద్రబాబు అరాచకాలు సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారనీ, గతంలో టీడీపీ హయాంలో హత్యారాజకీయాలకు తెరతీశారనీ, అలాంటి నేతలకు అవకాశం ఇస్తే ప్రజలు స్వేచ్ఛగా జీవించే పరిస్థితులు ఉండవని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు ఎస్ఎంఆర్ పెదబాబు, నాయకులు కోయ సత్తిబాబు ఉన్నారు.



ఎమ్మెల్యే ఆళ్లనాని సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు

సంక్షేమ పాలనకు అండగా నిలవాలి

గణపవరం : రాష్ట్రంలో కనీవినీ ఎరుగని రీతిలో సాగుతున్న సంక్షేమం, అభివృద్ధి పాలనకు ప్రజలంతా అండగా నిలవాలని, రానున్న మరో ఐదేళ్లు ఈపాలనను తెచ్చుకోవలసిన అవసరం ఉందని ఏలూరు ఎంపి కోటగిరి శ్రీధర్, ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు అన్నారు. మంగళవారం గణపవరం మండలం పిప్పర గ్రామానికి చెందిన పలువురు తెలుగుదేశం, జనసేన నాయకులు వైఎస్సార్‌కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువాలు వేసి శ్రీధర్, వాసుబాబు పార్టీలోకి ఆహ్వానించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఇచ్చిన వాగ్దానాలను నూరు శాతం అమలు చేసి మళ్లీ ప్రజాతీర్పుకోసం వస్తున్న జగన్‌ను ఆశీర్వదించాలన్నారు. చంద్రబాబు గతంలో ఇచ్చిన హామీలన్నీ తుంగలో తొక్కినా,పవన్‌కల్యాణ్, బీజేపిలు పట్టించుకున్న పాపాన పోలేదని, ఇప్పుడుకూడా కూటమిని గెలిపిస్తే జరిగేది ఇదేనని అన్నారు. కేవలం అధికారం కోసమే మూడుపార్టీలు కూటమికట్టి ప్రజలను ఏమార్చడానికి ప్రయత్నిస్తున్నాయన్నారు. వాస్తవాన్ని గ్రహించి, ప్రజలకు నిజంగా మేలుచేసే వైఎస్సార్‌సిపి ప్రభుత్వాన్ని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని వారు కోరారు. టీటీడీ పాలకవర్గ సభ్యుడు గాదిరాజు సుబ్బరాజు, గణపవరం ఎంపిపి అర్థవరం రాము, జిల్లా బిసిసెల్ అధ్యక్షుడు గంటా ప్రసాదరావు, మండల వైఎస్సార్‌సిపి కన్వీనర్ దండు రాము, జిల్లా వైఎస్సార్‌సిపి కార్యదర్శి నడింపల్లి సోమరాజు, స్థానిక నాయకులు ఐఎన్‌రాజు పాల్గొన్నారు.

TADEPALLIGUDEM MUNICIPALITY
E-PROCUREMENT TENDER NOTICE
Roc.No.2422/E1/2023-24 Dated :23.04.2024

S.no	Name of the Work	Name of the Grant	Estimate Value (Rs in Lakhs)	Bid Downloading Starting Date	Last Date for Receipt of Bids
1	Water Supply Works	General Funds	6.40	24.04.2024	30.04.2024

Full details can be had from the municipal Engineering Department during working hours or visit web site https://tender.apeprocurement.gov.in

Commissioner,
Tadepalligudem Municipality

రూ.13.64 కోట్ల విలువైన వస్తువులు సీజ్



ఉంగుటూరులో నగదు పట్టుకున్న అధికారులు

ఏలూరు (మెట్రో): సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో సీజర్ మేనేజ్‌మెంట్ ప్రక్రియ ద్వారా ఎన్నికలు కోడ్ అమలులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకూ జిల్లా వ్యాప్తంగా రూ.13.64 కోట్ల విలువైన నగదు, బంగారం, మద్యం, ఇతర వస్తువులు సీజ్ చేశామని కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ మంగళవారం చెప్పారు. ఇందులో రూ.203.20 లక్షలు నగదు కాగా, రూ.10.17 కోట్ల విలువైన బంగారం, వెండి ఆభరణాలు, రూ.136.15 లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నామన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ /ఎన్ కోర్ ద్వారా అందిన అభ్యర్థనలలో ఇంతవరకూ 2,006 అనుమతులు ఇచ్చామన్నారు. ఎన్నికల ప్రచార అనుమతుల కోసం సువిధ ద్వారా 2,045 అభ్యర్థనలు రాగా వాటిలో ఇంతవరకు 2006 అనుమతులు ఇవ్వగా, మరో 39 పరిశీలనలో ఉన్నాయన్నారు. సి-విజిల్ ద్వారా 399 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. మీడియాలో ఎన్నికల ఉల్లంఘనలకు వచ్చిన 106 ఫిర్యాదులు పరిష్కరించామన్నారు. ఎన్‌జీ ఎస్పీ పోర్టల్ ద్వారా 604 ఫిర్యాదులు స్వీకరించగా, 603 పరిష్కరించామని, మరొకటి పరిశీలనలో ఉందని కలెక్టర్ వివరించారు.

తనిఖీల్లో రూ.1.62 లక్షల పట్టివేత

ఉంగుటూరు: సార్వత్రిక ఎన్నికల సందర్భంగా ఉంగుటూరు చెక్‌పోస్టు వద్ద మంగళవారం నిర్వహించిన తనిఖీల్లో రూ.1,62,800 నగదు స్వాధీనం చేసుకున్నట్లు ఎన్నికల రిటర్నింగు అధికారి ఖజావల్లీ చెప్పారు. ఒక వాహనం నుంచి రూ.లక్షా తొమ్మిది వేల 800, మరో వాహనంలో రూ.53 వేలు నగదు తీసుకు వెళుతుండగా, పట్టుకున్నట్లు ఆర్వో తెలిపారు. ఎఫ్ఎస్‌టీ టీమ్ సభ్యులు ఈ నగదును స్వాధీనం చేసుకుని ట్రెజరీలో జమ చేసినట్లు వివరించారు.

63,166 టన్నుల ధాన్యం కొనుగోలు

ఏలూరు (మెట్రో) : ఏలూరు జిల్లాలో మంగళవారం వరకు 5,328 మంది రైతుల నుంచి రూ.136 కోట్ల విలువైన 63,166 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసినట్లు జేసీ బి.లావణ్యవేణి చెప్పారు. మంగళవారం ధాన్యం కొనుగోలు ప్రక్రియపై సంబంధిత అధికారులతో టెలీకాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. ధాన్యం కొనుగోలులో సమస్యలుంటే జిల్లాస్థాయిలో కంట్రోల్ రూమ్ నంబర్లు 08812-230448, 77020 03584, 75695 62076, 7569 597910 ఫోన్ నంబర్లకు తెలియజేయాలని కోరారు. రైతులకు పూర్తిస్థాయిలో సంబంధిత అధికారులు అవగాహన కల్పించి ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని జేసీ ఆదేశించారు.

జాతీయ చిత్రకళా పోటీల్లో పతకాల పంట

తణుకు అర్బన్ : జాతీయ స్థాయి చిత్రకళ పోటీల్లో తణుకు జెడ్పీ బాయ్స్ హైస్కూలు విద్యార్థులు సత్తా చాటి పతకాల పంట పండించారు. ఇటీవల నెల్లూరుకు చెందిన అమీర్ ఆర్ట్ అకాడమీ, విజయవాడకు చెందిన డ్రీమ్ యంగ్ అండ్ చిల్డ్రన్ ఆర్ట్ అకాడమీ జాతీయ స్థాయిలో విజయవాడలో నిర్వహించిన చిత్రకళా పోటీల్లో తమ విద్యార్థులు అత్యంత ప్రతిభ కనబరచి 35 బంగారు, వెండి పతకాలు సాధించినట్లు పాఠశాల హెచ్‌ఎం కె.పద్మావతి చెప్పారు. విద్యార్థులను, పాఠశాల చిత్రకళా ఉపాధ్యాయులు వెంపటాపును పాఠశాల సెక్రటరీ జీజే ప్రభువరం, ఉపాధ్యాయులు కనకదుర్గేశ్వరి, శైలజ ఉమాదేవి, వీరభద్రం, భీమేశ్వరరావు, కేశవశర్మ, పాపారావు, వీరబాబు, సంజయ్ గాంధీ, రాధ, శీలా, సురేంద్రనాథ్ అభినందించారు.

వైభవంగా రాట్నాలమ్మ తిరునాళ్ల ప్రారంభం

- తొలిరోజు బాలాత్రిపుర సుందరి అలంకరణలో దర్శనం
- అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎమ్మెల్యే కొఠారు



శ్రీరాట్నాలమ్మవారు



శ్రీ రాట్నాలమ్మ అమ్మవారికి హారతి ఇస్తున్న ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి

పెదవేగి: శ్రీరాట్నాలమ్మ అమ్మవారి తిరునాళ్లు రాట్నాలకుంటలో మంగళవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున చిత్తా నక్షత్రయుక్త కుంభలగ్నంలో ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి కలశ స్థాపన చేసి తిరునాళ్లను ప్రారంభించారు. దేవస్థానం ఈఓ ఎన్.సతీష్‌కుమార్, ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అబ్బయ్యచౌదరి మాట్లాడుతూ శ్రీరాట్నాలమ్మ వారు ఈ ప్రాంత ప్రజల ఆరాధ్య దేవత అన్నారు. జిల్లా నుంచే కాకుండా ఉభయ తెలుగు రాష్ట్రాలతోపాటు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి వస్తుంటారని, కోరిన కోర్కెలు తీర్చే కల్పవల్లిగా, పిలిస్తే పలికే తల్లిగా భక్తుల నీరాజనాలందుకుంటున్న శ్రీరాట్నాలమ్మ వారు ఎంతో మహిమగల దేవత అని కొనియాడారు. ఈ సందర్భంగా అమ్మవారి దర్శనానికి విచ్చేసిన ప్రజాప్రతినిధులను ఈఓ ఎన్.సతీష్, పాలకవర్గ సభ్యులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. ఉత్సవాల తొలిరోజు అమ్మవారు బాలాత్రిపుర సుందరి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలోని శ్రీ రామలింగేశ్వరస్వామివారికి పంచామృత అభిషేకం, అష్టోత్తర శత కలశాభిషేకం నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి కుంకుమార్చన, మంగళహారతి, మంత్రపుష్పం ప్రసాద వితరణ చేశారు. అనంతరం రాట్నాలకుంటకు చెందిన లక్ష్మీసాయి భజన సమాజం ఆధ్వర్యంలో నిర్వహించిన కోలాట ప్రదర్శన ఆకట్టుకుంది. రాత్రి 8 గంటలకు స్వాతి ఆర్కెస్ట్రా భీమవరం వారిచే సినీ మ్యూజికల్ నైట్ ఉత్సాహంగా జరిగింది. పలువురు ప్రజాప్రతినిధులు, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర సరిహద్దుల్లో పటిష్ట నిఘా

- కలెక్టర్ ప్రసన్న వెంకటేష్, ఎస్పీ మేరీ ప్రశాంతి
- ఏపీ, తెలంగాణ సరిహద్దు జిల్లాల అధికారుల సమావేశం

ఏలూరు (మెట్రో): కేంద్ర ఎన్నికల కమిషన్ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏపీ, తెలంగాణ సరిహద్దు జిల్లాల అధికారుల మధ్య సమన్వయం ఎంతో అవసరమని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వె.ప్రసన్న వెంకటేష్ స్పష్టం చేశారు. మంగళవారం ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం, ఏలూరు జిల్లాల అధికారులతో అంతరాష్ట్ర సరిహద్దుల్లో అనుసరించాల్సిన నిఘా తదితర అంశాలపై ఎస్పీ డి. మేరీ ప్రశాంతితో కలిసి కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సమావేశంలో ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల కలెక్టర్లు గౌతమ్, ప్రియాంక, ఎస్పీలతో పాటు ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు. కలెక్టర్ ప్రసన్న వెంకటేష్ మాట్లాడుతూ పరస్పర సమాచార మార్పిడితో ఎన్నికల నిర్వహణలో మంచి ఫలితాలు సాధించవచ్చన్నారు. అంతరాష్ట్ర సరిహద్దుల వెంబడి నగదు, మద్యంతో పాటు ఓటర్ల తరలింపునకు అడ్డుకట్టవేసే విషయంలో కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్‌కు 48 గంటల ముందుగా ప్రజల కదలికలను నియంత్రించాల్సిన అవసరం ఉందన్నారు. తనిఖీల్లో ఏ విధమైన సీజ్ జరిగిన అది రాష్ట్ర సరిహద్దు జిల్లాల అధికారుల మధ్య సమాచారం ఉండాలన్నారు. ఏ చెక్ పోస్టు ద్వారా తరలింపు జరిగిందో అటువంటి అంశాలపై కూడా దృష్టిసారించాలన్నారు. అటవీప్రాంతంలో అసాంఘిక వ్యక్తుల నక్సల్స్ కదలికలను నియంత్రించే భాగంలో అక్కడి కదలికలను గుర్తించేందుకు ట్రాప్ కెమెరాలను ఏర్పాటు చేయాలని అటవీశాఖ అధికారును ఆదేశించామన్నారు. ఎస్పీ డి.మేరీ ప్రశాంతి మాట్లాడుతూ నగదు, మద్యం, రవాణా కట్టడికి పటిష్టమైన నిఘా ఉంచాలన్నారు. ఇప్పటికే అంతరాష్ట్ర సరిహద్దుల్లో 8 చెక్ పోస్టులను ఏర్పాటు చేశామని, అందులో తాటియాకులగూడెం వద్ద ఇంటిగ్రేటెడ్ చెక్ పోస్టును కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో పాపిడిగూడెం, యాగర్తిగూడెం-రామన్నగూడెంలలో మరో రెండు సరిహద్దు చెక్ పోస్టులను ఏర్పాటు చేయాలని భద్రాద్రి కొత్తగూడెం ఎస్పీని కోరారు. మావోయిస్టుల కదలికలపై మరింత నిఘా ఉంచాలన్నారు. డీఆర్వో డి.పుష్పమణి, సెబ్ జేడీ ఎన్.సూర్యచంద్రరావు, ఎక్సైజ్ సూపరింటెండెంట్ పరమేశ్వరన్ పాల్గొన్నారు.